
హైదరాబాద్ వార్త



### జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉన్నతాధికారులు

హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం జిహెచ్ఎంసి అదనపు, జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో అదనపు కమిషనర్లు స్నేహశబరీష్, యాదగిరిరావు, ఉపేందర్‌రెడ్డి, శంకరయ్య, కృష్ణ, సరోజ, జయరాజ్‌కెనడీ, ఈవిడిఎం డైరక్టర్ ప్రకాష్‌రెడ్డి, అదనపు ఎస్‌పి సుదర్శన్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్ జియాఉద్దీన్, సిసిసి రాజేంద్ర ప్రసాద్, సిఈ ప్రాజెక్టు దేవానంద్, సిఈ సురేష్, జోనల్ కమిషనర్లు వెంకటేష్ ద్రోత్రే, వెంకన్న, మమత, శ్రీనివాస్‌రెడ్డి, పంకజ, రవికిరణ్, సిపిఆర్ఓ మహమ్మద్ ముర్తుజా, ఓఎస్‌డిలు వేణుగోపాల్, రమణ, సిఈఓ కమిష్‌సింగ్, ఎస్టేట్ అధికారి భాషాలు ఉన్నారు.

**నగరంలో కోడి గుడ్డు ధర భారీగా పెరిగింది. కోడిగుడ్ల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. గత నెల కార్తీకమాసం కావడంతో చికెన్, గుడ్ల లెక్కలు కాస్త తగ్గుదల కనిపించింది. కార్తీకమాసం ముగిసన తర్వాత కోడి గుడ్ల వినియోగం విపరీతంగా పెరగడంతో ధర కూడా అదే స్థాయిలో పెరిగింది. గత వారం కింద ఒక్కో గుడ్డు రూ.6.50పైసలు ఉండగా, ఇప్పుడు రూ.8కు చేరినట్లు తెలుస్తుంది.**

**హోల్‌సేల్‌లో ఒక్కో గుడ్డ రూ.8 పలుకుతోంది. కొన్ని రోజులుగా చలి బాగా పెరిగింది. దీంతో వెచ్చదనం కోసం ఆహారంలో కోడిగుడ్ల వినియోగం భారీగా పెరిగిందని అధికారులు అంటున్నారు. ముఖ్యంగా నగరంలో ఎగ్స్‌కు ఫుల్ డిమాండ్ ఉందని చెబుతున్నారు. మిగతా నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో కోడిగుట్ల వాడకం ఎక్కువగానే ఉందని చెబుతున్నారు.**

## కొండెక్కిన కోడిగడ్డు ధర



హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త : గత 15 రోజులక్రితం కేసు ధర రూ.160 ఉండగా, రిటైల్ వ మా ర్కె ట్ లో రూ.6కు విక్రయించారు. ప్రస్తుతం కేసు ధర రూ.180 నుంచి రూ.200 చేరడంతో రిటైల్ మార్కెట్‌లో రూ.7 నుంచి రూ.8 వరకు అమ్ముతున్నారు. మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కాగా, చలికాలం కావడంతో గుడ్ల ఉత్పత్తి తగ్గిందని, మామూలు రోజులతో పోలిస్తే చలికాలంలో గుడ్ల ఉప్పత్తి 60 శాతం ఉంచి 70 శాతానికి పడిపోతుందని వ్యాపారులు చెబుతున్నారు. మన దగ్గర ఉత్పత్తి అవుతున్న ఎగ్స్‌లో దాదాపు 50 శాతం ఢిల్లీ, ముంబై సిటీలతో పాటు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌వంటి రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

మరోవైపు చికెన్ ధర కూడా పెరిగిపోయింది. గత నెలలో కిలో చికెన్ రూ.170 నుంచి రూ.190 వరకు ఉండేది. అయితే తాజాగా రూ.240కి చేరటం గమనార్హం. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు మార్కెట్ నిపుణులు. క్రిస్మస్ వేడుకలు, న్యూ ఇయర్ ఈవెంట్స్ రావడంతో ప్రతి ఒక్కరూ బిర్యానీలకు మొగ్గు చూపారు. దీంతో చికెన్ డిమాండ్ పెరిగిపోయింది. ఇదే అదనుగా భావించి వ్యాపార స్తులు ధరలు పెంచేస్తున్నారు. మరో 10 రోజుల తర్వాత సంక్రాంతి పండుగ ఉండటంతో ప్రతి ఒక్కరూ ఇంట్లో నాన్ వెజ్ వండుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పక తప్పదు.

## పెళ్లి పీటలు ఎక్కకముందే..

**త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఓ యువకుడు మరో వ్యక్తి ర్యాష్ డ్రైవింగ్ కారణంగా అనుకోని ప్రమాదంలో ప్రాణాలు వదిలాడు. 15 రోజుల క్రితమే పెళ్లి నిశ్చితార్థం చేసుకున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మృతుడి కుటుంబ సభ్యుల రోధన వర్ణనాతీతంగా మారింది. గచ్చిబౌలిలో ఓ వ్యక్తి ర్యాష్ డ్రైవింగ్ కారణంగా యువకుడు మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.**



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రోహిత్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

**15రోజుల క్రితమే పెళ్లి నిశ్చితార్థం**

**అంతలోనే అనుకోని ప్రమాదంలో దుర్మరణం**

**గచ్చిబౌలిలో ర్యాష్ డ్రైవింగ్‌కు యువకుడు బలి**

గచ్చిబౌలి, జనవరి 2 ప్రభాతవార్త : గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... హన్మకొండ జిల్లా హన్మకొండ పట్టణానికి చెందిన ఎం.రోహిత్‌రెడ్డి(31) గతకొన్ని రోజుల క్రితం ఉద్యోగ నిమిత్తం నగరానికి వచ్చాడు. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని టిఎన్‌జిఓ కాలనీలో నివాసం ఉంటూ లుంబినీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలో సేఫ్టీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గత 15రోజుల క్రితమే రోహిత్‌రెడ్డికి పెళ్లి నిశ్చితార్థం జరుగగా, కుటుంబ సభ్యులు పెళ్లి పనుల్లో ఉన్నారు. రోహిత్‌రెడ్డి ఉద్యోగ నిమిత్తం నగరానికి తిరిగి వచ్చాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున 1.45 గంటల ప్రాంతంలో తాను నివాసం ఉంటున్న టిఎన్‌జిఓ కాలనీ నుంచి గచ్చిబౌలి త్రిపుల్‌ఐటి మార్గంలో తన ద్విచక్రవాహనం స్కూటీ మీద బయలుదేరాడు. మార్గమద్యలో ఐఎస్‌బి ముందుకు రాగానే ఇదే దారిలో వెనుక నుంచి అతివేగంతో దూసుకువచ్చిన వోక్స్ వ్యాగన్ టైగూన్ (ఎపి04 జిబి9035) కారు రోహిత్‌రెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోహిత్‌రెడ్డి ద్విచక్రవాహనం మీద నుంచి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న వ్యక్తి రోహిత్‌రెడ్డి మృతిచెందడం గమనించి కారును అక్కడే వదిలిపెట్టి సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. అదే మార్గంలో వెళ్తున్న వాహనదారులు విషయం గమనించి పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును గచ్చిబౌలి టిఎన్‌జిఓ కాలనీకి చెందిన నరేష్ గౌడ్ కారుగా గుర్తించారు. కాగా కారు నడిపింది ఎవరనే విషయం తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన కుమారుడు అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడడంతో రోహిత్‌రెడ్డి కుటుంబ సభ్యులు దుఖసాగరంలో మునిగిపోయారు.

### వైభవంగా అంతర్జాతీయ శాస్త్రీయ జానపద నృత్యోత్సవం



తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, సంస్కృతిక కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2024ను పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థ డైరెక్టర్, ప్రభుత్వ అంతర్జాతీయ కళాకారిణి, బాలీవుడ్, టాలీవుడ్ కొరియోగ్రఫర్, ప్రఖ్యాత ఒడిస్సీ నాట్యగురువు, ముఖ్యంగా హైదరాబాద్‌కు చెందిన డా. సుదిప్తపండ నేతృత్వంలో అంతర్జాతీయ శాస్త్రీయ, జాన పద నృత్యోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

## పెట్రోల్ పంపుల వద్ద ట్రాఫిక్ జాం..జాం..

**వాహనాల రద్దీతో నిదానంగా సాగిన ట్రాఫిక్**

**ట్రక్కు డ్రైవర్ల నిరసన విషయం తెలిసి ఒక్కసారిగా బంకుల వద్దకు వచ్చిన వాహన దారులు**



పెట్రోల్ కోసం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తా పెట్రోల్ బంక్ వద్ద బారులు తీరిన ద్విచక్రవాహన దారులు

బేగంపేట డిసెంబరు 2,ప్రభాతవార్త : జంట నగరాలలో వాహన దారులు ఒక్కసారిగా పెట్రోలు బంకులకు పోటెత్తడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన భారత న్యాయ సంహిత చట్టంలో హిట్ అండ్ రన్ కేసుల్లో నిబంధనలను కఠినతరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ట్రక్కు డ్రైవర్లు సమ్మెకు పిలుపు నిచ్చిన నేపథ్యంలో వాహన దారులకు పెట్రోలు పంపుల వద్ద బారులు తీరారు. బేగంపేట లోని పెట్రోలు పంపుల వద్దకు పెద్ద ఎత్తున వాహన దారులు తరలి రావడంతో పంపుల ప్రాంగణాలన్నీ నిండిపోయాయి. దీంతో కొందరు వాహనదారులు తమ వాహనాలకు పెట్రోలు,డీజిల్ కొట్టించుకునేందుకు వచ్చి రోడ్డుపైన నిలపడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.ట్రక్కు డ్రైవర్ల పిలుపు నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందన్న భయంతో వాహన దారులు బంకుల వద్ద బారులు తీరారు. బేగంపేట నుంచి సికింద్రా బాద్ వెళ్లే మార్గంలో ఉన్న పెట్రోలు పంపుల వద్ద భారీ వాహనదారుల క్యూ ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు నిదానంగా సాగారు.

## సమ్మె విరమించినా.. నో స్టాక్ బోర్డులు





**సమ్మె విరమించిన పెట్రోల్ ట్యాంకర్లు**

**అయినా.. పెట్రోల్ బంకుల్లో నోస్టాక్ బోర్డులు**

**బంకుల వద్ద భారీగా క్యూలైన్లు, స్తంభించిన ట్రాఫిక్**

మోటారు వాహనాల చట్టం సవరణను నిరసిస్తూ పెట్రోల్, అయిల్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన ఆందోళన విరమించారు. దీంతో ట్యాంకర్లు యథావిదిగా నడిచాయి. కాగా, మంగళవారం ఉదయం నుంచి అయిల్ ట్యాంకర్ల యజమానులు సమ్మెకు దిగడంతో పలు పెట్రోల్ బంకుల వద్ద ఎంట్రీ క్లోజ్ అంటూ నో స్టాక్ బోర్డులు పెట్టారు. దీంతో వాహనదారులు బంకుల వద్ద క్యూకట్టారు.నగరవ్యాప్తంగా పెట్రోల్,డీజిల్ బంకులలో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.రెండు రోజులు పెట్రోల్ బంకులు బంద్ అనడంతో ఒక్కసారిగా పెట్రోల్ బంకుల ముందు వాహనదారులు క్యూకట్టారు. ముందు జాగ్రత్తగా స్టోరేజ్ చేసి పెట్టుకుంటున్నారు.

హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త : కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ లేక నో స్టాక్‌బోర్డు పెట్టి మూసేవారు. వందలాది బైక్‌లు, కార్లు, ఆటోలు పెట్రోల్ కొట్టించుకోవడానికి బంకుల ముందు భారీ క్యూలు కట్టారు. సమ్మె కారణంగా పెట్రోల్ బంకులు ఎన్నిరోజులు మూస్తారో, మళ్లీ ఎప్పుడు పెట్రోల్ దొరుకుతుందోనని ముందు జాగ్రత్తగా స్టోరేజ్ చేసి పెట్టుకునేందుకు వాహనదారులు క్యాన్‌లు, ఖాళీ డబ్బాలు పట్టుకొని లైన్‌లలో నిల్చున్నారు. నగరంలో ఏ పెట్రోల్ బంకులో చూసినా వాహనదారులు బారులు తీరారు. బషీర్ బాగ్, హైదర్‌గూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, జీడిమెట్ల, గాజులరామారం, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, హాయత్‌నగర్, మలక్‌పేట, దిల్‌సుఖ్ నగర్, రామంతాపూర్, బోడుప్పల్, అంబర్‌పేట, విద్యానగర్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల ముందు భారీ రద్దీ నెలకొంది. దీంతో వాహనదారులను కంట్రోల్ చేయలేక కొన్ని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనం ఇచ్చాయి.మరోవైపు పెట్రోల్, డీజిల్ రేట్లను కేంద్రం తగ్గిస్తుందనే భావనలో కొందరు బంకు నిర్వాహకులు పెట్రోల్, డీజిల్ ఫుల్ స్టాక్ చేయించుకోలేదు. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ అయిపోవడంతో..నగరంలో పలు చోట్ల బంకుల యజమానులు 'నో స్టాక్' బోర్డులు పెట్టారు. పెట్రోల్ బంకుల వద్ద రహదారిపైకి వాహనదారులు భారీగా చేరుకోవడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.

## నేడు పలు ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం

హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త: హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న కృష్ణా డ్రికింగ్ వాటర్ సరఫరా మొదటి దశలో సంతోష్‌నగర్ వద్ద ఉన్న 1600 ఎంఎం దయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్‌పైప్‌లైకు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఎస్ఆర్‌డిపిలో భాగంగా నల్గొండ – ఓవైసి డౌన్ ర్యాంప్ అలైన్‌మెంట్‌లో ఉన్న సంతోస్ నగర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులకు ఇబ్బందులు కలగకుండా జంక్షన్ పనులు చేయనున్నారు. ఈ పనులు బుధవారం ఉదయం 6గంటల నుంచి 4వ తేది గురువారం ఉదయం 6గంటల వరకు జరుగుతాయి. ఈనేపథ్యంలో పలు రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అదికారులు తెలిపారు. డివిజన్ 1 పరిధిలో మిరాలం, కిషన్‌బాగ్, ఆలుబైన్ కాలనీ, డివిజన్ 2ఏ సంతోష్‌నగర్, వినయ్ నగర్, సైదాబాద్, చంచల్‌గూడా, ఆస్మన్‌ఘడ్, యాకత్‌పుర, మాదన్నపేట, మహబూబ్‌మాన్షన్, డివిజన్ 2బి రియాసత్‌నగర్, అలియాబాద్, డివిజన్ 4 బొగ్గుల కుంట, అఫ్జల్‌గంజ్, డివిజన్ 5 నారాయగూడ, అడిక్‌మెట్, శివం రోడ్, నల్లకుంట, చిలకలగూడ, డివిజన్ 10ఏ దిల్‌సుఖ్‌నగర్, డివిజన్ 20 బొంగుళూరు, డివిజన్ 22 పరిధిలోని మన్నెగూడలో నీటి సరఫరాలో అతరాయం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

## నా భర్త ఆస్తిని బిడ్డలపై రాయండి

**అత్త వేధింపులతో ముగ్గురు పిల్లలతో ఆందోళనకు దిగిన మహిళ**



ముగ్గురు పిల్లలతో కలిసి న్యాయ పోరాటానికి దిగిన మహిళ

నార్సింగి, జనవరి 2 ప్రభాతవార్త : భర్త చనిపోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న కోడలికి అన్ని విధాలుగా అండగా నిలువాల్సిన అత్త, ఆడ పడుచులు ఆ మహిళను నిత్యం వేధిస్తున్నారు. సూటి, పోటి మాటలతో దెప్పి పొడుస్తూ నిత్యం అవమానిస్తున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ఆమె మణికొండ మున్సిపాలిటీలో చిన్నపాటి ఉద్యోగం చేస్తుంది. చీత్కారాలు, అవమానాలు, సూటిపోటి మాటలు అన్నింటిని భరిస్తూ బిడ్డలకు బంగారు భవిష్యత్తును ఇచ్చేందుకు కష్టపడుతుంది. ఇంతలో తన అత్త తన భర్తకు దక్కాల్సిన ఆస్థిని తన కూతుళ్లకు రాసివ్వడంతో... తన బిడ్డలు రోడ్డు పాలవుతారని ఆందోళన చెంది న్యాయ పోరాటానికి దిగింది. వివరాలలోకి వెళితే... గండిపేట మండలం మణికొండ మున్సిపల్ శివాజినగర్ ప్రాంతానికి చెందిన ధన్‌రాజ్‌తో సుధారాణి వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు సంతానం. భర్త కొడిచెర్ల సత్యనారాయణ అలియాస్ ధన్‌రాజ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ తరువాత నాకు అండగా ఉండాల్సిన అత్త, ఆడ పడుచులు నిత్యం సూటి,పోటి మాటలతో వేధిస్తున్నారని సుధారాణి అనేక మార్లు బస్తీ పెద్దలు, గ్రామ పెద్దలకు ఫిర్యాదులు చేసింది. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. పైగా మమ్ములను గ్రామంలో పలుచన చేస్తున్నావంటూ నా బిడ్డలకు న్యాయంగా రావాల్సిన ఆస్థుల్ని మా అత్త తన కూతుళ్లకు రాసిచ్చిందని, తనకు, తన బిడ్డలకు చట్టపరంగా రావాల్సిన ఆస్థిని ఇప్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ముగ్గురు బిడ్డలతో కలిసి సుధారాణి న్యాయ పోరాటానికి దిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాతల నుంచి వచ్చిన ఆస్థిపై నా బిడ్డలకే సర్వ హక్కులున్నాయని, తన భర్త కష్టపడి కొన్న ఇంటిని నా బిడ్డల పేర్లపై రాయించాలని వేడుకుంటుంది. మా అత్త, ఆడపడుచుల నుంచి నాకు, నా ముగ్గురు బిడ్డలకు ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో మణికొండ పుర ప్రముఖులు, శివాజినగర్ బస్తీ పెద్దలంతా కల్పించుకొని తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని, న్యాయం జరిగేంత వరకు తను ప్రారంభించిన ఈ న్యాయ పోరాటాన్ని ఆపబోనని స్పష్టం చేశారు. ఈ క్రమంలో తన ప్రాణాలు పోయినా సరే వెనక్కి తగ్గేది లేదని సుధారాణి పేర్కొన్నారు. ఈ మహిళకు న్యాయం జరుగుతుందా? లేదా? పుర ప్రముఖులు స్పందిస్తారా? లేదా? కాలమే సమాధానం చెప్పాలి.

## నగరంలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్



హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త : నగరంలో ట్రాఫిక్ సమస్యలు నరకప్రాయంగా మారుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు ముగించుకొని ఇంటికి చేరాలంటే పద్మవ్యూహాన్ని ఛేదించినంతగా శ్రమించాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులకు నరకాన్ని చవిచూపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అంటే కేవలం చలాన్‌లు విధించడమే తప్ప ట్రాఫిక్ చిక్కులను తప్పించేవారు కాదనేంతగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నగంరలో నిర్ధిత సమయంలో రాకపోకలు సాగించాల్సి వాహనాలు ఇష్టానుసారంగా తమ ఇష్టమైన సమయంలో నగర రోడ్లపైకి వస్తున్నాయి. దీనికి తోగు కొన్ని ప్రాంతాల్లో భారీ వాహనలు రోడ్లపైనే నిలపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లను నివారించాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం ఛలాన్‌లు విధించడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని ప్రయత్నాలను చేసినా ట్రాఫిక్ సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. నగరంలో అందుబాటులో ఉన్న ఫ్లైఓవర్‌లు కూడా ఫలితం దక్కడం లేదు. చాలా వరకు ప్రధాన రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయి గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతున్నా ఒక్క ట్రాఫిక్ పోలీసు రోడ్లపై కనిపించడం లేదనే ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి గమ్యస్థానాలు చేరుకోడానికి రెండు, రెండున్నర గంటల పాటు ఇబ్బందులు పడకతప్పడం లేదు. అమీర్‌పేట్, పంజాగుట్ట, ఎస్సార్‌నగర్, మెహిదీపట్నం, లక్డీకాపూల్, మలక్‌పేట్, బేగంపేట్, మెట్టుగూడ, తార్నాక, ఉప్పల్, రసూల్‌పురా, సికింద్రాబాద్, మినిస్టర్‌రోడ్, బేగం బజార్, చార్మినార్ లాంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యం అయ్యాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే దాదాపు రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. గతంలో పండుగలు, ఆదివారాలలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. కాని ఇప్పు డు దానికి భిన్నంగా తయారైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడినా అవి గంట సమయంలోనే సాఫీగా మారతాయి. వర్షాకాలం వస్తే మాత్రం ఎప్పటికి ట్రాఫిక్ క్లియర్ అవుతుందో చెప్పలేని పరిస్థితి.

**ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల సంఖ్య పెంచినా**

నగంరలో ట్రాఫిక్ జామ్‌లను నియంత్రించడానికి అధికారులు కొన్ని చర్యలు తీసుకున్నప్పటికి ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కలేదు. గతంలో నగర వ్యాప్తంగా 18 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లు ఉండగా వాటిని 31కి పెంచారు. ట్రాఫిక్ పోలీసుల సంఖ్య కూడా దాదాపు 3వేలకు పైగానే ఉంది. అయినప్పటికి ఫలితం అంతంత మాత్రమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ సమ స్యలను పరిష్కరించడం కోసం అధికారులు రాత్రి 11 గంటలకే వ్యాపారాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా రోడ్డుపక్కన నిలుపుతుండడంతో ప్రధానరోడ్లలో ట్రాఫిక్ జామ్‌కు కొన్నిచోట్ల కారణమవుతున్నాయి.

కొన్ని హోటల్ నుల, బార్‌లు, వైన్‌షాపుల ముందు రోడ్లపైనే ద్విచక్రవాహనాలు నిలిపి కోనుగోలు చేస్తుండడంతో ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ వ్యాపారుల వద్ద ట్రాఫిక్ పోలీసులు మామూళ్ళు వసూల్ చేస్తున్నట్లు సమాచారం.

**ట్రాఫిక్ పోలీసులపై పెరుగుతున్న వత్తిడి**

ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ఛలాన్‌ల వసూల్‌లపై దృష్టిసారిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందికి రోజువారి టార్గెట్‌లను విధించడం వల్ల వారు ఛలాన్‌లు విధించడంపైనే దృష్టి సారిస్తున్నారు. కొన్ని బిర్యానిసెంటర్‌లు, బార్‌లు, వైన్స్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు వసూల్‌కు పాల్పడుతుండడం వల్ల ఇక్కడి ట్రాఫిక్‌ను నియంత్రించడంలో వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతస్థాయి అధికారుల కారణంగానే ఇలాంటి వసూల్‌లకు పాల్పడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాఠశాలను సందర్శించిన

## కార్పొరేటర్, స్వచ్ఛంద సంస్థలు

వార్త ప్రభావం



అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక, ఎం.వి.పౌండేషన్ సంస్థ

కంటోన్మెంట్, జనవరి 2 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేకున్నా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ టీచర్ అనే శీర్షికతో గత నెల 31న జాతీయ వార్త దినపత్రికలో ప్రచురితమైంది. అందుకు మారేడ్‌పల్లి ఉప విద్యా శాఖ అధికారి విజయ్ కుమార్, మోండా డివిజన్ కార్పోటర్ కొంతం దీపిక, ఎం.వి. పౌండేషన్ మండల ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జీ చింతల లక్ష్మి నారాయణల బృందం బస్తీని, పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు విద్యార్థులు రాకపోవడానికి గల కారణాలు ఏమిటని ఆరా తీశారు. వెయ్యి కుటుంబాలు నివాసం ఉంటున్న బస్తీలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు సక్రమంగా వచ్చే విధంగా తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, బస్తీ పెద్దలు, టీచర్లు సహకరించాలన్నారు. అదే విధంగా పాఠశాలలో మంచినీరు, విద్యుత్, టాయిలెట్ ఫర్నీచర్ వంటి మౌళిక సదుపాయాలు మెరుగుపర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు ఎన్.అంజయ్య ముదిరాజ్, చిన్న వీరయ్య, ఎంవి.పౌండేషన్ ప్రతినిధులు సువర్ణ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## సూపర్‌మ్యాక్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి**



భూపతిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సూపర్‌మ్యాక్స్ కార్మికులు

దుండిగల్, జనవరి 2 ప్రభాతవార్త: సూపర్ మ్యాక్స్ పరిశ్రమ యాజమాన్యం కంపెనీని లాకౌట్ చేసి సుమారు 18 నెలలు గడుస్తున్న యాజమాన్యం తమ గోడును పట్టించుకోవడం లేదని కార్మికులు మంగళవారం టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సా రెడ్డి భూపతిరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గత 18నెలలుగా 1000మంది కార్మికులు కుటుంబాలను రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 12నెలలుగా తాము రిలే నిరహార దీక్షలు చేపట్టినప్పటికి యాజమాన్యం నుండి ఎటువంటి స్పందన లేదని తెలిపారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ సూపర్‌మ్యాక్స్ కంపెనీ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటిపరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామినిచ్చారు. ఈరోజు రిలే దీక్షలో ఉన్న రంగన్న, రామక్రిష్ణారెడ్డిలకు తన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శుభాకాంక్షల వెల్లువలు..

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన చీరె**

**బేగంపేట..** నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గం సీనియర్ బీజేపీ నాయకులు చీరె సత్యనారాయణ అలియాస్ శ్రీకాంత్ కల్సి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా చీరె సత్యనారాయణ మాట్లాడుతూ కిషన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలోని బీజేపీ బలపడుతుందన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త కూడా ఆయన నేతృత్వంలో ఉత్సాహంతో ముందుకెళుతున్నారని ఆయన అన్నారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు..**



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు మోహన్,వెంకటేశ్ యాదవ్

**కంటోన్మెంట్,.** సికింద్రాబాద్ నార్త్ లాలాగూడలో నివాసం ఉంటున్న టీపీసీసీ ఓబిసి ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో నగర కాంగ్రెస్ నేతలు వెంకటేశ్ యాదవ్, రాము, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

**టీపీసీసీ ఇంచార్జిని మర్యాదపూర్వంగా కలిసిన ఆదం సంతోష్‌కుమార్**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపక్‌దాస్‌ను కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ కంటెస్టెడ్ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ మర్యాదపూర్వంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కోదండరామ్‌ను కలిసిన కూకట్‌పల్లి ఉద్యమకారులు**

**కెపిహెచ్‌బి కాలనీ..** కూకట్‌పల్లి నియోజక వర్గానికి చెందిన జేఏసీ నాయకులు ఉద్యమకారులు మంగళవారం జేఏసీ నేత ప్రొఫెసర్ కోదండరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో కోదండరామ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు అయిన ప్రభుత్వంలో ఉద్యమకారులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు విద్యా వెంకట్, ఆర్.కె.దయాసాగర్, దుంబాల శ్రీనివాసరెడ్డి, సముద్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్థ అభ్యున్నతి కోసం అధికారులు సిబ్బంది కృషి చేయాలి



ఎస్.ఈ. గోపయ్యకు పుష్ప గుచ్చాలు అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యుత్ అధికారులు,సిబ్బంది

**మైలార్‌దేవ్‌పలి..** రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం ప్రతి నిధులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఇ గోపయ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ గోపయ్య మాట్లాడుతూ సంస్థ అభ్యున్నతి కోసం అధికారులు, సిబ్బంది పని చేయాలని తెలిపారు. సర్కిల్ టెక్నికల్ రామచంద్రయ్య, అకౌంట్స్ అధికారి హరీష్, చంద్రశేఖర్, 1104 యూనియన్ రీజినల్ కార్యదర్శి లక్ష్మీ నారాయణ గౌడ్, సంయుక్త కార్యదర్శి జి.వేణుగోపాల్, సర్కిల్ యూనిట్ అధ్యక్షులు రామ శంకర్, వర్కింగ్ ప్రెశిడెంట్ సైదా నాయక్, కందుకూరు డివిజన్ యూనిట్ యూనియన్ అధ్యక్షులు రమేష్, వర్కింగ్ ప్రెశిడెంట్ శ్రీనివాస్, షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు భాష, వర్కింగ్ ప్రెశిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, ప్రతినిధులు శ్యామ్, రఘు, గణేష్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ తదితరులు

## అర్హులందరికి అభయహస్తం పతకాలు అందిస్తాము

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**



మణికొండలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, జనవరి 2 ప్రభాతవార్త : అర్హులైందరికి అభయహస్తం పతకాలన్నీ అందజేస్తామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 15.వ,వార్డులో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమానికి కమీషనర్ ఫల్గుణ్ కుమార్, వైస్ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. పలువురు ప్రజలకు అభయహస్తం దరఖాస్తు పత్రాలు పంపిణీ చేశారు. ప్రజలిచ్చిన దరఖాస్తు ఫారాలను స్వీకరించి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పతకాలను అర్హులందరికి అందేలా నావంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి నావంతు పూర్తి సహకారం అందజేస్తానన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పతకాలు అందకపోతే నేరుగా నన్ను సంప్రదించాలని, మీకు పూర్తి న్యాయం జరిగేలా నావంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రకటించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రజలంతా వరుసగా నాలుగో మారు నాపై పూర్తి విశ్వాసం ఉంచి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారని, వారి బాగు కోసం నేను కూడా ఎంతవరకైన తెగిస్తానని స్పష్టం చేశారు. ఇంకా దరఖాస్తులు ఎలా పూరించాలో తెలియక చాలా మంది అవస్థలు పడుతున్నారని, స్థానిక నాయకులు గాని, అధికారులు, సిబ్బంది గాని అవగాహన కల్పించాలన్నారు. ఈనెల ఆరో తేదీ వరకే అభయహస్తం దరఖాస్తులకు అవకాశం ఉందని, వీలైనంత త్వరంగా ప్రజలంతా దరఖాస్తు చేసుకొని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, కౌన్సిలర్లు బుద్దోలు కావ్యశ్రీ, వసంత్ చౌహాన్, పద్మారావ్, నవీన్ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్విన్ కాలనీలో క్రిస్టియన్ సోదరులకు బట్టలు పంపిణీ



బట్టలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పోరేటర్ దొడ్ల

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 2, ప్రభాతవార్త : ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంశీగూడలోని ఫుల్ గాస్పెల్ చర్చిలో క్రిస్టమస్ వేడుకల సందర్భంగా బట్టల పంపిణీ కార్యక్రమంలో కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి క్రిస్టియన్ సోదరి సోదరమణులకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరి సోదరమణులకు ప్రతి సంవత్సరం బట్టలు పంపిణీ చేయడం జరిగిందని అధికారులు సమన్వయంలోపం వలన క్రిస్మస్ పండుగ తరువాత బట్టలు రావడం చాలా బాధాకరమైన విషయం, ఇంకా కూడా కొన్ని చోట్ల చర్చీలలో బట్టలు రాలేదని మా దృష్టికి వచ్చిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా సకాలంలో పండుగలోపు బట్టలు పంపిణీ చేస్తే పేద ప్రజలు సంతోషించే వారని ఇక నుండి సకాలంలో పండుగలోపు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాశినాథ్‌యాదవ్, మోజేశ్, పాస్టర్లు ఇజ్రాయిల్, సత్యరాజ్, కర్ణాటక రాజు, సురేష్‌కుమార్, రాజు, గోపి, ముఖేష్, దేవదాసు, ఫిలిప్, సుమన్, నాగభూషణం, చర్చ్ పాస్టర్లు, క్రిస్టియన్ సోదరి సోదరమణులు పాల్గొన్నారు.

## అడ్వకేట్ జనరల్‌ను కలిసిన తెలంగాణ న్యాయవాదులు



అడ్వకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డిని కలిసిన తెలంగాణ న్యాయవాదులు

ముషీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌గా నూతనంగా నియమితులైన ఏ.సుదర్శన్‌రెడ్డిని తెలంగాణ న్యాయవాదులు కలసి అభినందనలు తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో కలిసిన వారు సుదర్శన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయత్ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయవాదికి సావిత్రిబాయి పూలే అవార్డు

నాంపల్లి, జనవరి 2 ప్రభాతవార్త : ప్రఖ్యాత సంఘ సంస్కర్త, సామాజికవేత్త, మహిళా విద్యాప్రదాయిని సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో 3 బుధవారం ఉదయం రవీంద్రభారతిలోని నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రముఖ న్యాయవాది గోగికార్ ఉమారాణికి సావిత్రిబాయి పూలే అవార్డును ప్రధానం చేయనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, పూలే జయంతి ఉత్సవాల కమిటీ ఛైర్మన్ మణిమంజరి నేడొక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు న్యాయవాది జి.ఉమారాణి పేద, బడుగు, బలహీనవర్గాల మహిళలకు ఉచితంగా న్యాయసేవలు గత 22 సంవత్సరాలుగా నిర్విరామంగా అందిస్తున్న సామాజికసేవకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపికచేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ తదితరులు హాజరుకానున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 2 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో మంగళవారం శ్రీ రాముడి అక్షింతలు పంపిణీ కార్యక్రమం జరిగింది. అయోధ్య శ్రీ రాముని అంక్షితలను శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర బాధ్యులు రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జ్. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డికి వితరణ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఇంటికి అక్షింతలతో పాటు అయోధ్య శ్రీ రామాలయం ఫోటో, కర పత్రం, పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తోకల కరుణాకర్‌రెడ్డి, నవర్ మురళీధర్ రెడ్డి, బొమ్మరాజు నర్సింహ, నాగరాజ్ దంపతులు, మహేందర్‌రెడ్డి, శశికాంత్‌లు పాల్గొన్నారు.

### అక్షింతల ఊరేగింపు

చిక్కడపల్లి, జనవరి 2 ప్రభాతవార్త: ఆయోధ్య రామమందిరంలో ప్రాణప్రతిష్ట పూజిత అక్షింతల ఊరేగింపు మహోత్సవ వేడుకలు మంగళవారం బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్ ఆధ్వర్యంలో ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. మొదట ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పవిత్రమైన రాములవారి అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘ్‌పరివార్ కార్యకర్తలు వెంకటరమణరావు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎంసీఏలో క్రిస్మస్, న్యూయర్ వేడుకలు

అడ్డగుట్ట, జనవరి 2 ప్రభాతవార్త: క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లోని షారోన్ క్రీస్తు గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సికింద్రాబాద్ వైఎంసీఏ హాల్‌లో నిర్వహించిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. క్రిస్టియన్ మైనార్టీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. చర్చి అధ్యక్షుడు పి.దాస్, ప్రధాన కార్యదర్శి బి.మల్లయ్య, కోశాధికారి పి.విల్సన్, చర్చి ఫాదర్లు జాన్‌పాల్, బెనార్, జేకబ్, బస్తీ నాయకులు రౌతు రాజయ్య, బాలనరసింహ్మ, నారాయణ, తాటికాయల యేసు రత్నం, చందర్, చిన్న వీరయ్యలు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్లను అందజేశారు.

## తెలుగు విశ్వవిద్యాలయ 2024 క్యాలెండర్ ఆవిష్కరణ



నాంపల్లి, జనవరి 2 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆంగ్ల నూతన సంవత్సరం 2024 సంవత్సర క్యాలెండర్‌ను విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు మంగళవారం ఉదయం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం తెలుగుభాష, సాహిత్యం, లలితకళల పట్ల చేస్తున్న కృషిని గుర్తు చేస్తూ ఈ ఏడాది నుండి విశ్వవిద్యాలయంలో కొన్ని వినూత్న కోర్సులను ప్రారంభిస్తున్నట్లు, పరిశోధనా స్థాయిని మరింత విస్తృతస్థాయిలో కొనసాగించనున్నట్లు తెలిపారు. త్వరలో బాచుపల్లిలోని వందెకరాల విస్తీర్ణంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన ప్రాంగణాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టురమేష్, ఆచార్య రెడ్డిశ్యామల, ఆచార్య కోట్ల హనుమంతరావు, భోధన బోధనేతర సిబ్బంది, సంఘనాయకులు పాల్గొన్నారు.

### చింతల్‌మెట్‌లో మహిళ అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 2 ప్రభాతవార్త : చింతల్‌మెట్‌లో ఓ మహిళ అదృశ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ సత్తార్ భార్య హాలీమా బేగం (44) కొద్ది రోజుల క్రితం ఎవరికి చెప్పకుండ ఇంటి నుంచి వెళ్లి పోయింది. కుటుంబ సభ్యులు హాలీమా బేగం కోసం అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో భర్త అబ్దుల్ సత్తార్ తన భార్య హాలీమా బేగం కనిపించటం లేదంటూ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంత్ గాడ్గే బాబా వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న వేణుగోపాల్

సంత్ గాడ్గే బాబా వర్ధంతికి

## సామాజిక కార్యక్రమాలు

ముషీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త: సంత్ గాడ్గే బాబా వర్ధంతి సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ వేణుగోపాల్ తెలిపారు. జనవరి 1 సంత్ గాడ్గే బాబా వర్ధంతి సందర్భంగా సామాజిక సమరసత వేదిక సికింద్రాబాద్ బాగ్ కన్వీనర్ బలరాం ఆధ్వర్యంలో కవాడిగూడలోని ఆర్యసమాజ్ భవన్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక తెలంగాణ మహిళా కన్వీనర్ రుక్మిణి, ఆర్యసమాజ్ కవాడిగూడ అధ్యక్షులు ఆంజనేయులు, రఘుపతి, విశ్వేశ్వర్, మురళి, సుధాకర్ పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన టి-జెఏసి



సైఫాబాద్, జనవరి 2 ప్రభాతవార్త: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి (టి-జెఏసి) ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ మేరకు జెఏసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటీకాల పురుషోత్తం ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం రాష్ట్ర సచివాలయం సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బోకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఆయనతోపాటు జెఏసి కో-కన్వీనర్ ఎం.వేణు తదితరులు ఉన్నారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



డ్రైనేజీ మ్యాన్‌వల్ పర్యవేక్షిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, స్థానిక బస్తీ వాసులు

హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లోని గంగానగర్‌లో డ్రైనేజీ మ్యాను వల్‌లో ప్లాస్టిక్ సరిగా లేకపోవడం వల్లనే డ్రైనేజీ నీరు, మంచి నీటి ట్యాంకలలోకి వస్తున్నాయని స్థానిక బస్తీ వాసులు మంగళవారం డివిజన్ కార్పోరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కారించాలని కార్పోరేటర్ అధికారులను ఆదేశించారు. దీంతో స్థానిక అధికారులు, స్థానిక బస్తీవాసులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ కలిసి సమస్యను పర్యవేక్షించారు.

## భజరంగ్‌సేనా పూజలు



బేగంబజార్, జనవరి 2 ప్రభాతవార్త: ఫలకనుమాలోని చారిత్రాత్మకమైన కాళీమాతా మందిరం అమ్మవారి దేవాలయంలో తెలంగాణ భజరంగ్‌సేనా ప్రతినిధులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈపూజ కార్యక్రమంలో తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త, కార్యదర్శి సూర్యశుక్లా, మనోజ్, నరేష్, విజయ్, అధిత్య పాల్గొన్నారు. ఆలయ కమిటి ప్రతినిధులు వారిని పూలమాలవేసి సన్మానించారు.

## సుందరయ్య పార్కును అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**



ప్రసంగిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జనవరి 2 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కును అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో వాకర్లకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.శ్రీనివాసచారి నూతన అధ్యక్షుడు రూపుల వివేక్, ప్రధాన కార్యదర్శి బాదమోని వెంకటస్వామిగౌడ్, కోశాధికారి సిరిగిరి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి.రాజుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఎస్.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ప్రతిరోజు తప్పకుండా వాకింగ్, వ్యాయామం చేయాలన్నారు. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. క్లబ్ నూతన అధ్యక్షుడు ఆర్.వివేక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ముఠాగోపాల్, రామ్‌నగర్ కార్పొరేటర్ రవిచారి సహకారంతో పార్కును మరింత అభివృద్ధి చేయడంతో పాటు, వాకర్స్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో రామ్‌నగర్ కార్పొరేటర్ రవిచారి, బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, సీనియర్ నేత వెంకటకృష్ణ(బబ్లు), క్లబ్ పూర్వ అధ్యక్షులు రమేశ్‌రెడ్డి, మన్నెదామోదర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌గౌడ్, పూర్వ ఉపాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు వి.నాగభూషణం, ఎస్ఎస్‌కె.ప్రసాద్, లింగప్రకాశ్, బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

**ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత..** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బాగ్‌లింగంపల్లి షిరిడి సాయిబాబా దేవాలయంలో ఓ దాత సుమన్ అందించిన సహాయంతో భక్తుల కోసం నిర్మించబోయే షెడ్ నిర్మాణ పనులను రామ్‌నగర్ కార్పొరేటర్ రవిచారితో కలిసి ప్రారంభించారు.

# హిందీ ప్రచార సభలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి

## సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.పి.కపూర్

సైఫాబాద్, జనవరి 2 ప్రభాతవార్త: నాంపల్లిలోని హిందీ ప్రచార సభను అక్రమించి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై తక్షణమే కఠినంగా చర్యలు తీసుకోవాలని ప్రచార సభ పూర్వ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్వ ఉద్యోగులు ఆర్.పి.కపూర్, కె.నరేందర్, నమ్రత, మహేష్‌సింగ్ తదితరులు మాట్లాడుతూ అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించామని తెలిపారు. నాంపల్లిలోని హిందీ ప్రచార సభలోని కొంత భాగాన్ని అక్రమించుకుని కోట్లాది రూపాయలకు విక్రయించి సొసైటిలోని ప్రతినిధులు షేక్ గైబువలీ, చెంద్రదేవ్‌కౌడ్, సురేష్‌పూరి దోచుకున్నారని, అంతేకాకుండా వివిధ జిల్లాల్లోని ఆస్తులను కూడా అమ్ముకున్నారని ఆరోపించారు. 1935లో ప్రారంభించిన హిందీ ప్రచార సభ 1966లో రిజిస్ట్రేషన్‌గా గుర్తింపు పొందిందని, అలాగే హిందీ ప్రచార సభ ట్రస్ట్ ఏర్పడిందన్నారు. ట్రస్ట్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నించిందుకే తమను అన్యాయంగా తొలగించారని చెప్పారు. విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసి, ఎందుకు పనికిరాని నకిలీ సర్టిఫికేట్లు ఇస్తున్నారని వారు ఆరోపించారు. సిఎం వెంటనే ఈ ప్రచార సభపైన విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని, దొంగిలించబడ్డ ఆస్తులను స్వాదీనం చేసుకోవాలని వారు కోరారు.


నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

## విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ క్యాలెండర్ ఆవిష్కరణ

జీడిమెట్ల, జనవరి 2, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసం కార్యాలయంలో మంగళవారం కుత్బుల్లాపూర్ మండలం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ 2024ను ఎమ్మెల్యే కెపి వివేకానంద ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్ ఆవిష్కర కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం సభ్యులు బాల బ్రహ్మాచారి, రాజుచారి, కిషోర్ చారి, రవీంద్రచారి, మల్లేష్ చారి, బిక్షపతి చారి, రవీందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే కెపి వివేకానందకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటి మేయర్, కార్పోరేటర్లు..**

**నిజాంపేట్..** ఎమ్మెల్యే కెపి వివేకానందను వారి కార్యాలయం వద్ద మంగళవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తల్లారి వీరేష్, సీనియర్ నాయకులు, ఆవుల జగన్ యాదవ్, నాయకులు సాయి ముదిరాజ్, దశరథ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

### కేటిఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

జీడిమెట్ల, జనవరి 2, ప్రభాతవార్త : ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు మంగళవారం బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

# ఫిబ్రవరి 11న "రన్ ఫర్ఎ గర్ల్ చైల్డ్ " కార్యక్రమం

**సేవాభారతి అధ్యక్షులు డి.దుర్గారెడ్డి**

హైదరాబాద్, జనవరి 2,ప్రభాతవార్త: సమాజ సంక్షేమానికి అంకితమైన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ, సేవా భారతి తన వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం "రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్ " 8వ ఎడిషన్ 2024 ఫిబ్రవరి 11 ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నట్లు సేవాభారతి అధ్యక్షులు డి.దుర్గారెడ్డి , ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉషా అయ్యర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహాక సమావేశంలో వారు మాట్లాడుతూ ఈకార్యక్రమం ద్వారా వచ్చే ఆదాయాన్ని సేవాభారతి కిశోర్ వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌లోని మురికివాడల్లోని ఆడపిల్లల అభ్యున్నతికి కృషి చేయబోతున్నట్లు తెలిపారు. కిశోర్ వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు 10,236 మంది బాలికలకు సాధికారత కల్పించామని ఈకార్యక్రమం ద్వారా 2030నాటికి లక్షమంది ఆడపిల్లలకు భవిష్యత్ ప్రణాళికల ద్వారా సాధికారత లభించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈరన్‌కు ఫ్రీడమ్ అయిల్, గ్లోబల్ డేటా, ఇన్ఫోసిస్, జిఈపి,హెల్త్‌ఎడ్జ్, యశోద, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మీటింగ్ కార్పొరేషన్ ,బిడిఎల్, మిథాని వంటి సంస్థలు సహకరిస్తున్నాయని అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమాల ద్వారా రాబోయే "రన్ ఫర్ ఏ గర్ల్‌చైల్డ్" కార్యక్రమంలో పాల్గొనాలని దాతలను కోరారు. నిరుపేద ఆడపిల్లల భవిష్యత్‌ను మార్చే లక్ష్యానికి సేవాభారతి కట్టుబడి ఉంటుందని వారు పేర్కొన్నారు.

## ఏఎఫ్ఎం రేసింగ్ ఛాంపియన్‌గా సాయిదీప్



హైదరాబాద్, డిసెంబరు 2,ప్రభాతవార్త: అమెరికాలో ఇటీవల జరిగిన అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ మోటార్ సైకిలిస్ట్ (ఏఎఫ్ఎం) ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌లో నివాసి కవాసకి నింజా రేసర్ ఎం.సాయిదీప్ సత్తాచాటారు. 69ఏళ్ల ఏఎఫ్ఎం చరిత్రలో భారతీయుడు విజేతగా నిలవడం తొలిసారని సాయిదీప్ ఒక్రపకటనలో తెలిపారు. థండర్ విల్ రేస్ ఫార్ములా 40 లైట్ వెయిట్ నోవీస్ ఈవెంట్‌లో 176 పాయింట్లు సాధించి ప్రతిభను చాటినట్లు వివరించారు. ఈసందర్భంగా సాయిదీప్ మాట్లాడుతూ తొలిఏకైక భారతీయుడిగా ఈఛాంపియన్‌షిప్‌ని గెలుచుకున్నందుకు తనకు చాలా గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించి దేశానికి మంచి గుర్తింపు తీసుకువస్తానన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత్ రేసింగ్‌ల్లో ప్రతిభ చాటేలా వాటి ప్రముఖ్యతపై అందరికి అవగాహన కల్పించేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా 2013లో మహి రేసింగ్ టీమ్ ఇండియా వరల్డ్ ఛాంపియన్‌షిప్‌ని గెలవడానికి సాయిదీప్ అమితంగా కృషి చేశారు. మహిరేసింగ్ టీమ్ ఇండియా వ్యవస్థాపకులుగా ఉండి ఎంఎస్‌ధోని, అరుణ్‌పాండే, ప్రముఖ టాలీవుడ్ నటుడు నాగార్జున, నందీష్, అమిత్, సత్యవంటి ప్రముఖ వ్యక్తులతో కలిసి పనిచేశారు.

## అంగరంగ వైభవంగా గుండం
# బాలాజీ బ్రహ్మోత్సవాలు


ధ్వజారోహణ క్రతువును నిర్వహిస్తున్న పండితులు

అల్వాల్, జనవరి 2 ప్రభాతవార్త: చారిత్రాత్మకమైన నాలుగు శతాబ్దాలు చరిత్ర కలిగిన గుండం బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలు రెండవ రోజు మంగళవారం పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలతో పాటుగా ద్వజారోహణ కార్యక్రమం జరిగింది. బుధవారం సాయంత్రం స్వామి తిరు కళ్యాణోత్సవం జరుగుతుందని ఆలయ వంశ పారంపార్య ధర్మకర్తలు పరాంకుశం మాధవ్ ప్రధాన అర్చకులు పరాంకుశం కృష్ణమాచార్యులు తెలిపారు. కళ్యాణోత్సవంలో పాల్గొన దలిచిన భక్తులు ప్రధాన అర్చకులను ముందస్తుగా సంప్రదించాలని వారు కోరారు.

## కోదండరామ్‌ను కలిసిన ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు


అల్వాల్, జనవరి 2 ప్రభాతవార్త: ఆచార్య కోదండరామ్‌ను తెలంగాణా ఉద్యమకారుల ఫోరం ప్రతినిధి బృందం మంగళవారం కలిసింది. ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పటోళ్ళ సురేందర్ రెడ్డిలు ఆచార్యకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన కార్పోరేటర్లు, అధికారులు


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పోరేటర్లు, అధికారులు, అభిమానులు

కంటోన్మెంట్, జనవరి 2 ప్రభాతవార్త: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం మారేడ్‌పల్లిలోని మాజీ మంత్రి తలసాని నివాసంకు సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన కార్పోరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు, వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, మాజీ మంత్రి,ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శాలువాలు, పుష్పగుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ సుదర్శన్, అధికారులు మురళీక్రిష్ణ, మహిపాల్, యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, కార్పోరేటర్లు మహేశ్వరి, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి,శేఖర్, ఆరీఫ్ పాల్గొన్నారు.

## పేద వర్గాలకు సంక్షేమ పథకాలు



కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 2, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ పేద వర్గాలకి అట్టడుగు స్థాయి వర్గాలకి కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలు చేరే విధంగా కృషి చేస్తామని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూస్తామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు కలిగిన వస్తువులనే వినియోగించాలి

చిక్కడపల్లి, జనవరి 2 ప్రభాతవార్త: నాణ్యతాప్రమాణాలు కలిగిన వస్తువులనే వినియోగించాలని ప్రముఖ విద్యావేత్త, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్ కోరారు. భారతీయ ప్రమాణాల సంస్థ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాణ్యతాప్రమాణాలపై అంబేద్కర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును సరోజా వివేక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. వస్తు ఉత్పత్తి సంస్థలు గుర్తింపు ఆమోదించి చట్టబద్ధమైన నాణ్యతాలోపబుయిష్టమైన ఉత్పత్తులపై సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## నేడు సావిత్రిబాయి పూలే జయంతి..
# ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం

సైఫాబాద్, జనవరి 2 ప్రభాతవార్త: ప్రథమ భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతి ఉత్సవం, అలాగే సావిత్రిబాయి పూలే అంతర్జాతీయ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం బుధవారం మధ్యాహ్నం 1 గంటకు రవీంద్రభారతిలో జరుగుతుందని పూలే ఫౌండేషన్, ఎంబిసి అండ్ డిఎన్‌టి సంఘాలు తెలిపాయి. ఈ మేరకు మంగవారం వీటికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను సంఘాల ప్రతినిధులు మీనగ గోపిబోయ, ఆళ్ల రామకృష్ణ, తిపిరిశెట్టి శ్రీనివాస్, పరమేశ్వరి, సురేందర్, గగనము వెంకటస్వామి, పెంటయ్య, జైహింద్, మేకల అరుణరాణి తదితరులు మాట్లాడుతూ 3వ తేదీన జరిగే కార్యక్రమాల్లో ముఖ్యఅతిధులుగా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విఫ్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య పాల్గొంటారని చెప్పారు. ఆత్మీయ ముఖ్యఅతిధులుగా-సన్మాన గ్రహీతలుగా రాష్ట్ర శాసన సభ్యులు రాజ్‌ఠాకూర్, వీర్లపల్లి శంకర్, రాజాసింగ్, వాకిటి శ్రీహరి, పాయల్ శంకర్, టి.పద్మారావుగౌడ్, రామారావుపటేల్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొంటారని వారు వివరించారు.

# మణికొండలో ఇంటింటికి శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



నార్సింగి, జనవరి 2 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీలో ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి అక్షింతలు గడప గడపకు పంపిణీ చేశారు. పిల్లలు, పెద్దలు అంతా కలిసి వీధి వీధి తిరుగుతూ జైశ్రీరాం... జైజైశ్రీరాం... అంటూ రామ భజనలు చేస్తూ అక్షింతలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 5.శతాబ్దాల హిందువుల కళ ఈనాటికి నెరవేరుతుండడంతో దేశమం తా పండగ వాతావరణం నెలకొందన్నారు. బాల రాముడి విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా అయోధ్య నుంచి రాముడి అక్షింతలను దేశంలోని నలు మూలల అందేలా ధార్మిక సంస్థలు తీసుకున్న నిర్ణయం అభినందనీయమైందన్నారు. రాముడి గుడి నిర్మించే సమయంలో సైతం దేశ వ్యాప్తంగా ఉన్న భక్తులు తమకు తోచినంతా చందాలు రాశారని, ఇప్పుడు ఆలయ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆ రామచంద్రుడి అక్షింతలను భక్తులందరికి చేరేలా ఈ నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమన్నారు. మణికొండలోని ప్రతీ గడపకు ఈ మహిమాన్విత అక్షింతలు చేర్చేందుకు మావంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ అక్షింతలను పూజ గదుల్లో దాచుకోవాలని, శుభ కార్యాలు జరిగే సమయంలో వీటిని కలుపుకొని అక్షింతలు తయారు చేస్తే పుణ్యం మరింత పెరుగుతుందన్నారు. చేపట్టిన కార్యాలు సఫలీకృతం అవుతాయని రామకృష్ణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, కౌన్సిలర్లు కావ్యశ్రీ, వసంత్‌రావ్ చౌహాన్, శైలజ, కో ఆప్షన్ సభ్యులు సిద్దప్ప, మాజీ వారునడ సభ్యులు శ్రీప్రియ రాజిరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, ఏర్పుల కుమార్, శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీశ్రీ, అందె లక్ష్మణ్, శేషు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన
# అయ్యప్ప ఐక్యవేధిక ప్రతినిధులు



అఫ్జల్‌గంజ్,జనవరి 2ప్రభాతవార్త: శబరిమలై అయ్యప్ప స్వాములు పడుతున్న ఇబ్బందులపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని తెలంగాణ అయ్యప్ప ఐక్యవేధిక ప్రతినిధులు సచివాలయంలో కలిసి అక్కడి ఇబ్బందులపై వినతిపత్రం అందచేశారు.ప్రతి సంవత్సరం ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలు మాల వేసుకుని లక్షలాదిగా స్వాములు చిన్న పిల్లలు, మహిళలు శబరిమలకు అయ్యప్ప స్వామి దర్శనానికి వెలుతూ ఉంటారన్నారు.ఈ సంవత్సరం అయ్యప్ప స్వాములకు మంచినీరు,ఆహారం సరైన వైద్యసదుపాయం లేకపోవడంతో,నిలక్కల్, నుండి పంబా వరకు రవాణా సౌకర్యం సరిగా లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు.ఐక్యవేధిక ప్రతినిధుల సమస్యలను విన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ఉన్నతాధికారిని కేరళ ముఖ్యమంత్రి పినరై విజయ్,ట్రావెంకోర్ దేవస్థానం బోర్డు వారితో మాట్లాడి తెలుగు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించే విధంగా వారితో చర్చించి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరాలన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో అయ్యప్ప స్వామి ఐక్యవేధిక ప్రతినిధులు నాయిని బుచ్చిరెడ్డి గురుస్వామి,బాలకృష్ణగురుస్వామి,రాధాకృష్ణగురుస్వామి,ప్రేమ్‌గాంధీ గురుస్వామి, రాకేష్‌గురు స్వామి,ప్రభాకర్‌రెడ్డి గురుస్వామి,విజయ్‌బాస్కర్‌గురుస్వామి పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్లస్థలాల
# అంశంపై జోక్యం చేసుకోండి

**గవర్నర్ తమిళసైకి ప్రోగ్రెసివ్ జర్నలిస్టు అసోసియేషన్ వినతి**



హైదరాబాద్, జనవరి 2,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర హెడ్ క్వార్టర్స్, జిల్లాలల్లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపును సంబంధించి గవర్నర్ జోక్యం చేసుకుని ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రోగ్రెసివ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కమిటీ రాష్ట్ర గవర్నర్ తమిళసైకి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి జర్నలిస్టుల సమసన్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలకు పైగా జిల్లాలతోపాటు రాజధాని ప్రాంతంలో ఇండ్ల స్థలాలు లేక జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఆరుదశాబ్దాలుగా అటు ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలంగాణ వరకు జర్నలిస్టులకు ఇంటిస్థలాలు కేటాయించడం ఆనవాయితీగా వస్తుందని అయితే గత 25ఏళ్లుగా దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇంటి స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం తరపున జాప్యం జరుగుతుందన్నారు. ఈనేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రాజధాని కేంద్రంలో ఉన్న దిజర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్, జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీ ,ఇతర సొసైటీలకు ప్రాధాన్యత ప్రాతిపధికన ఇళ్లస్థలాలు కేటయించేవిదంగా ప్రభుత్వానికి సూచించాలన్నారు. ఈసందర్భంగా తమ విన్నపాన్ని విన్నగవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ జాతీయ అధ్యక్షులు వి.వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.ఉగ్రసేన్, సీనియర్ జర్నలిస్టు శ్రీలత, రంగయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి నాయకత్వంలో
# అరుగ్యారెంటీలను అమలు చేసి తీరుతాం

**సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.అనీల్‌కుమార్ యాదవ్**

చిక్కడపల్లి, జనవరి 2 ప్రభాతవార్త: రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు కటుబడి ఉన్నామి సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.అనీల్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లో యువజన కాంగ్రెస్ నాయకులు సాయికీర్త్(బాబ్జీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అనీల్‌కుమార్ యాదవ్ ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు గుర్రం చంద్రకళ, మాజీ కార్పొరేటర్ అరుణజయేందర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం సత్యనారాయణ, మారిశెట్టి నర్సింగరావు, గుండుజగదీశ్, జయేందర్‌బాబు, సురేశ్, డిహెచ్.మధుమతి, నవీన్, సలీమ్, రాజు, రమేశ్, గిరి, కవిత, నరేందర్‌యాదవ్, పంతులు తదితరులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంభించిన అవినీతి అక్రమాలను బయటకు తీసి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు తమ ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలను ఉపక్రమించిన వెంటనే బిఆర్ఎస్ నేతల్లో గుబులు మొదలైందన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


బన్సీలాల్‌పేట్‌లో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, జనవరి 2 ప్రభాతవార్తః ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం బన్సీలాల్‌పేట్‌లో అధికారులతో కలిసి బీజేఆర్ నగర్, ఎంసీహెచ్ క్వార్టర్స్, డి క్లాస్, అరుణ్‌జ్యోతి కాలనీ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ముందుగా బీజేఆర్ నగర్‌లో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు నివాళులు అర్పించారు. అనంతరం స్థానికంగా రూ. 6లక్షలతో చేపట్టనున్న సివరేజీ పైప్‌లైన్, రూ. 4.5 లక్షలతో చేపట్టనున్న మరో సివరేజి పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి ఎంసీహెచ్ క్వార్టర్స్‌కు చేరుకొని నూతన సంవత్సరం సందర్భంగా స్థానికులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేశారు. అనంతరం స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ బస్తీలోని శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరగా వెంటనే స్తంభాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఇక్కడే ఉన్న విద్యుత్ అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరగా డ్రైనేజి పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. వివేకానంద నగర్‌లోని ఖాళీ స్థలంలో పార్క్‌ను నిర్మించాలని స్థానికులు కోరగా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్‌లు హేమలత, టి.మహేశ్వరి, ఈఈ సుదర్శన్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్, ఏడీఈ కృష్ణ, జలమండలి సీజీఎం శశాంక్, ఏఈ సంధ్య, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు, పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, నేతలు ప్రేమ్, అబ్బాస్, రజాక్, కుమార్ యాదవ్, ఫహీం, బలరామ్, సత్యనారాయణ, నర్సింగ్‌రావు, గోవర్ధన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## దళిత వైతాశికుడు భాగ్యరెడ్డి వర్మ

మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి



చిక్కడపల్లి, జనవరి 2 ప్రభాతవార్త: అంబేద్కర్ కన్నా ముందుగానే తెలంగాణ నేలపై ఆవిర్భవించిన భాగ్యరెడ్డి వర్మ ధీనుల ఉద్దరణ కోసం పోరాడిన దళితజన బాంధవుడు అని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో శతాబ్ది పూర్వ మహనీయులయాదిలో కార్యక్రమంలో భాగంగా దళిత వైతాశికుడు భాగ్యరెడ్డి వర్మ సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల ప్రజలకు విద్య అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఆది హిందూ విద్యాలయంను హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ వద్ద నిర్మించి ఉచిత విద్యను అందించిన భాగ్యరెడ్డి వర్మ సదా స్మరణీయులు అని అన్నారు. ఆయన నైజామ్ పాలిత ప్రాంతాలలో వివక్షతకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేసిన త్యాగశీలి అని, కాని చరిత్రలో ఆయనకు తగిన గుర్తింపు రాలేదన్నారు. కార్యక్రమంలో గాయకులు రామసుబ్రహ్మణ్యం, సినీ నిర్మాత రామసత్యనారాయణ, సమాజసేవకుడు మూర్తి పాల్గొన్నారు.

### 2024లో విజయాలు సాధించాలి : జంపనప్రతాప్

కంటోన్మెంట్,జనవరి 2 ప్రభాతవార్త: కొత్త సంవత్సరంలో నూతన లక్ష్యాలతో అన్నింటిలో కంటోన్మెంట్ బోర్డు విజయం సాధించాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌ను మంగళవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, బోర్డు ఇంజనీర్లు గోపాల క్రిష్ణదాస్, బాలక్రిష్ణ, శానిటరీ సూపరిండెంట్, ఎం.దేవేందర్‌లు సిఈఓకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
GHMC

నిట్ సం. 27/EE-7(4B)/CRZ/GHMC/2023-24. పనిపేరు : క్ర.సం.1 నుండి 7. అంచనా ధర (రూ.లక్షలలో) రూ.83.60 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 02.01.2024 మ.2.00గం. వర్క. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ: 06.01.2024 మ.2.00గం. వర్క. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ జి.ఏకాంబరం EE (FAC) సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, మస్రత్ గ్రౌండ్, దరాబ్‌జంగ్‌కాలనీ, హైదరాబాద్ ఫోన్ నం: 7673951166. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, GHMC.

DIPR.No.9096-PP/CL/Advt/1/2023-24 తేదీ: 02.01.2024



**PUBLIC NOTICE**

General public at large are hereby informed that my client **SMT. BANDARU NAVYA GAYATRI,** W/o. Late Sri. Bandaru Srinivas, R/o. Flat No.501, H.No.2-2-185/56/F, Vaishnavi Enclave, Bagh Amberpet, Hyderabad, while shifting her residence in Bagh Amberpet has lost the Original registered documents i.e., The Sale Deed vide doct. 716/2001, dt.03-02-2001 registered at RO-Rangareddy District in respect of open Plot No.3 admeasuring 817.0 Sq yards and Plot No.4 admeasuring 685 Sq.yds, total admeasuring 1502 Sq.yds or 1255.67 Sq.mtrs, in Sy. No.713, situated at Devar Yamjal Village and Grampanchayat, Shameerpet Mandal, Rangareddy District. Also lost the original Sale deed vide doct. No.1814/2014, dt.22-05-2014 registered at JSRO Shameerpet in respect of open Plot No.3/Part, admeasuring 470.0 Sq.yds or 392.92 Sq.mtrs in Sy. No.713, situated at Devar Yamjal Village and Grampanchayat, Shameerpet Mandal, Rangareddy District. Since the above properties were self-acquired properties of my client's husband Late Sri. Bandaru Srinivas during his lifetime and my client along with her son and daughter has succeeded to Late Sri. Bandaru Srinivas estate after his death on 09-06-2021 at Hyderabad. The general public is hereby cautioned not to deal in respect of above missing documents and any persons found these Original documents i.e., The Sale deeds, shall handover the same to my client or to the Advocate. In the event if any person or persons or litigants found creating any charge over the property to create litigation, then they will be prosecuted in accordance with the law.

M/s. **T. RAVINDER RAO,**
Advocate,
Office at H.No.10-103/3,
SriKrishna Nagar Colony,
Peerzadiguda, Medipally Mandal,
Medchal-Malkajgiri District-500098.
**Mobile No.9652058339**



**IN THE COURT OF THE I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: SECUNDERABAD.**
**O.S.NO.1108 OF 2023**

Between :
1. Siddicka Wajid
2. Saad Hussain

....**Plaintiffs**

**AND**

1. Mandal Revenue Officer
2. All Concerned

...**Defendants**

To
2. All Concerned.

Please take Notice that the above referred Suit O.S. is filed against all concerned and you for declaring the Plaintiffs as the sole legal heirs of Late Mohammed Wajid Sait and Late Sana Wajid. The said suit is posted for your appearance on **29.01.2024, at 10.30 a.m.** before the Hon'ble 1st Junior Civil Judge, City Civil Court at Secunderabad. Therefore, kindly appear on the said date and time before the Hon'ble Court, either in person or through a duly appointed Advocate. Failing to do so matter would be preceded ex-parte. Hence this Notice.

(By the Order of Hon'ble I Junior Civil Judge)
(City Civil Court at Secunderabad)

**SHAIK IQBAL PASHA**
**AMAN ADNAN MAHMOOD**
**KARIKA DILIP KUMAR**
Advocates
**MAHMOOD & CO.Advocates**
#1-7-347 to 349, II Floor, Suite 'A',Mahmood Complex, Parklane, Secunderabad-03
Counsel for Plaintiffs.

## ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ న్యాయం : పారిజాత



బడంగ్‌పేట్ ప్రజా పాలనలో ప్రసంగిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జనవరి 2 ప్రభాతవార్త:** ప్రజా పాలన సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ న్యాయం జరుగుతుందని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. కార్పొరేషన్‌లోని 20వ డివిజన్‌లో జరిగిన వార్డు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన పేదలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించే ఉద్దేశ్యంతోనే ప్రజా పాలన వార్డు సభలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ బడుగు సుమన్‌రావు, స్థానిక కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సిహెచ్‌ఓ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి గౌడ సంఘం నేతల సత్కారం

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారి లక్ష్మారెడ్డిని మంగళవారం ఉప్పల్ గౌడ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. ఉప్పల్ గౌడసంఘం అధ్యక్షుడు బజారు కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు బజారు జగన్నాధ్‌గౌడ్, బజారు మురళీకృష్ణగౌడ్, అబ్బగోని శ్రీనివాస్‌గౌడ్, బజారు హరికృష్ణగౌడ్, బజారు హేమంత్‌కుమార్‌గౌడ్, రంగ భాస్కర్‌గౌడ్, పల్లె రాజ్‌కుమార్‌గౌడ్, బింగి భరత్‌గౌడ్, బంగారం లక్ష్మణ్‌గౌడ్, పోతగోని బాలరాజుగౌడ్, బూత్కూరి సాయిగౌడ్, నవీన్‌గౌడ్, పంజాల శ్రవణ్ గౌడ్, బింగి బాబ్జీగౌడ్, నేతలు రమేష్‌గౌడ్, బద్దం జ్ఞానేశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నవీన్‌గౌడ్ తదిరతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ గౌడ సంఘం సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. గౌడ కులస్థులు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

## సాయిరాంనగర్‌లో శ్రీరామ అక్షితలకు పూజలు



భజనలు చేస్తున్న కాలనీవాసులు

**సైదాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** అయోధ్య నుంచి చంపాపేట డివిజన్ సాయిరాంనగర్‌కు చేరుకున్న శ్రీరామ అక్షితలకు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డితో పాటు కాలనీవాసులు స్వాగతం పలికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో సంకీర్తనలు, భజనలతో గడప గడపకు అక్షితలు అందించారు. ఈ కార్యక్రమంలో సుఖజీవన్ రెడ్డి, ముకుంద్‌రెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, రఘునందన్‌రావు, శేఖర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, సర్వేష్, విజయలక్ష్మి, షాలిని, రజిత తదితరులు పాల్గొన్నారు.

## అనాధ బాలలకు బాసటగా నిలవాలి: శృతి

**సరూర్‌నగర్, జనవరి 2 ప్రభాతవార్త:** సమాజంలో అనాధలుగా బతుకుతున్న బాలలకు అండగా నిలబడాలని మాజీ ఎంపిటిసి దిండు శృతిభూపేష్‌గౌడ్ కోరారు. సాగర్‌రోడ్డులోని కీర్తన ఫౌండేషన్‌లో ఆమె అనాధలలకు సేవా కార్యక్రమాన్ని నిర్వహించి అనాధలతో కలిసి కేకులు కట్‌చేసి భోజన ఏర్పాట్లు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాధలుగా ఉన్న బాలలు డిప్రెషన్‌కు లోనుకాకుండా వారికి చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. యాంత్రిక జీవితంలో పరుగులు తీసే వారు అప్పుడప్పుడు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దిండు భూపేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు సాంప్రదాయాలకు ప్రతిరూపాలు



వేడుకలను నిర్వహిస్తున్న ప్రభుచరణ్, ఇమ్మాన్యుయేల్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 2 ప్రభాతవార్త :** ఉత్సవాలు సాంప్రదాయాలకు ప్రతిరూపాలని మూసారాంబాగ్‌లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్ ప్రభుచరణ్, పాస్టర్ వన్య ఇమ్మాన్యుయేల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చర్చిలో వారి ఆధ్వర్యంలో నూతన సంతవ్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సోదరభావంతో మెలగాలన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చర్చికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి దైవ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను జరుపుకున్నారు.

## సమాజానికి సాహితీవేత్తలు, కళాకారులు కవులు మార్గదర్శకులు : అంజనీకుమారి



అంజనీకుమారికి మెమోంటోను అందజేస్తున్న నిర్వాహకులు

**మలక్‌పేట, జనవరి 2 ప్రభాతవార్త :** సమాజానికి సాహితీవేత్తలు, కవులు మార్గదర్శకులని రాష్ట్ర ఎస్‌సిఎస్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి అంజనీకుమారి పేర్కొన్నారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన సినీ గానలహరి, జాతీయ సాహితీ కళా సేవా ప్రతిభ పురస్కారాలు-2023 కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సాహితీవేత్తలు, కవులు, కళకారులు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, సమాజాన్ని మార్చగలిగే శక్తి వారికి మాత్రమే ఉంటుందన్నారు. అనంతరం పలువురు గాయకులు సుప్రసిద్ధమైన పాటలను ఆలపించి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు డాక్టర్ ఇందిరా, గాయకులు డాక్టర్ విల్సన్, నారాయణస్వామి, శ్రీనివాసనాయుడు, గౌతంరాజు, పసునూరి శ్రీనివాసులు, శంకరనారాయణ, తరుణ్‌మెహత, త్రినాధరావు పాల్గొన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, నిర్వాహకులు ఇందిరకు అమెరికాలోని సుప్రసిద్ధ యూనివర్సిటీ వారి చే డాక్టరేట్ డిగ్రీలను అందజేయడం జరిగింది.

## త్వరలో ఉప్పల్‌లో వంద పడకల ఆసుపత్రి



మంత్రి రాజనరసింహాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో త్వరలోనే వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుడుతామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనరసింహాతో పలువురు కార్పొరేటర్లు, పార్టీ నేతలు బేటి అయ్యారు. అనంతరం ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు ఉప్పల్ నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి కోసం స్థలం పరిశీలిస్తున్నామని, త్వరలోనే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహాతో తనకు ఎంతో పరిచయం ఉందని, ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బన్నాల గీత, ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఇంటింటికి శ్రీరాముడి అక్షితలు పంపిణీ



శ్రీరాముడి అక్షితల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జనవరి 2 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయం, ఎస్‌కేడినగర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఇంటింటికి శ్రీరాముని అక్షింతల కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అయోధ్య శ్రీరామ జన్మభూమి ప్రారంభోత్సవ సందర్భంగా శ్రీరాములవారికి పూజ చేసిన యజ్ఞ అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేయడంతోపాటు రామలీలా చిత్రపటం, ఆహ్వానపత్రిక అందజేస్తున్నారు. జై శ్రీరామ్ నినాదాల మధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం మహోన్నతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు కొంతం నవ కిషోర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రాజిరెడ్డి, కాలనీ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ధనరాజ్, వికాస్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డితోనే ఇందిరమ్మ రాజ్యం సాధ్యం



సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సీతారాంరెడ్డి తదితరులు

**కుషాయిగూడ, జనవరి 2 ప్రభాత వార్త.** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ పిసిసి నాయకులు కె.సీతారామ్‌రెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని పలువురు నాయకులతో కలిసి ఆయన సిఎంరేవంత్‌రెడ్డినీ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకే ఒక్కడు లాంటి సిఎం రేవంత్ రెడ్డి ఒక్కడేనని కొనియాడారు. ఆయన ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరికీ తగిన న్యాయం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని కలలను సాకారం చేయగలిగే సత్తా ఆయనకు ఉందన్నారు.

## ట్రాన్స్‌జెండర్లను హెచ్చరించిన దర్పల్లి

**సైదాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** సాగర్ రింగు రోడ్డు, బైరామల్‌గూడ చెరువు వద్ద రాత్రి వేళల్లో న్యూసెన్స్ క్రియేట్ చేస్తూ స్థానికులకు ఇబ్బందులు కలుగజేస్తున్న ట్రాన్స్ జెండర్‌లను లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ట్రాన్స్‌జెండర్లు మరోకసారి ఇక్కడ న్యూసెన్స్ క్రియేట్ సహించేదిలేదని, అంతేగాకుండా కొంత మంది ఇక్కడ బహిరంగంగా మద్యం సేవిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయని అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


## లయన్స్ క్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయం



చీరెలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ విద్యావతి

**హయత్‌నగర్, జనవరి 2 ప్రభాతవార్త:** పేద మధ్యతరగతి ప్రజలకు సదుపాయాల కల్పన, దుస్తుల వితరణ వంటి కార్యక్రమాల ద్వారా లయన్స్‌క్లబ్ సేవలు అందించడం అభినందనీయమని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతివిజేందర్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ హైదరాబాద్ కృష్ణనగర్ ఆధ్వర్యంలో శాంతినగర్, వి.పి.ఆర్.నగర్ కాలనీలో కౌన్సిలర్ చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజలు, విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్నకార్యక్రమాలు అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పూర్వ గవర్నర్లు వై.ఎం.ధర్, మనోహర్‌రెడ్డి, కృష్ణప్రసాద్,ఇన్నారెడ్డి, గంపా నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, సురేష్, క్లబ్ ప్రెసిడెంట్ బాలయ్య, కార్యదర్శి రాఘునాథరెడ్డి, కోశాధికారి చారి, శామ్యుల్, శాంతినగర్ కాలనీ అధ్యక్షుడు సురేష్, విపిఆర్ కాలనీ అధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : షేక్ అక్బర్



సిఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న షేక్ అక్బర్

**మలక్‌పేట, జనవరి 2 ప్రభాతవార్త :** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మలకోపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి షేక్ అక్బర్ పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సిఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ దరఖాస్తులను అధికారులకు అందజేయాలని తెలిపారు.

## తెల్ల రేషన్ కార్డులను ధనికులు రద్దు చేసుకోవాలి: డిప్యూటీ మేయర్ శేఖర్



వార్డు సభలో ప్రసంగిస్తున్న బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, జనవరి 2 ప్రభాతవార్త:** ఆర్థికంగా మెరుగ్గా ఉన్నవారు తెల్ల రేషన్ కార్డులను స్వచ్ఛందంగా రద్దు చేసుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పిలుపునిచ్చారు. బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ప్రజా పాలన వార్డు సభకు హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేసే సంక్షేమపథకాలు అవసరంలేని వారు, ఆర్థికంగా అభివృద్ధి చెందినవారు తెల్ల రేషన్‌కార్డులను రద్దు చేసుకుంటే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజాసంక్షేమం కాంక్షించే ప్రజాప్రతినిధుల్లో ఎవరికైనా తెల్ల కార్డులు ఉన్నట్లయితే వాటిని రద్దు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ బడుగు సుమన్‌రావు, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైహింద్, అధికారులు సిహెచ్ నర్సింగ్‌రావు, జ్యోతి, వి.యాదగిరిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

**తెల్ల కార్డు రద్దు చేసుకున్న కార్పొరేటర్ ఇంద్రసేన...** కాగా పేదలకు మెరుగైన సంక్షేమం అందాలనే ఉద్దేశ్యంతో తన కుటుంబానికి ఉన్న తెల్ల రేషన్ కార్డును డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ సూ ్ఫర్తితో రద్దు చేసుకుంటున్నట్లు నాదర్‌గుల్ కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన ప్రకటించారు.

## ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన కార్పొరేటర్ సునీత రాముయాదవ్



ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన కార్పొరేటర్ సునీతరాము యాదవ్..

**నేరెడ్‌మెట్, జనవరి 2 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ మేకల సునీతరాము యాదవ్ తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని మధుసూధన్‌నగర్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6గ్యారెంటీల కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయన్నారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డితో ఎంపిఆర్ బేటి

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త :** తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా బేటి అయ్యారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు సక్రమంగా అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ఆరు గ్యారంటీలు సక్రమంగా అమలు అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఆదర్శంగా విజయదుర్గ పొదుపు సంఘం



పొదుపు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్లు, సంఘం సభ్యులు

**తుర్కయాంజాల్, జనవరి 2 ప్రభాతవార్త :** కేవలం పది మందితో మొదలైన విజయదుర్గ పొదుపు సంఘం అంచెలంచెలుగా ఎదిగి వేలమంది సభ్యులు, కోట్ల రూపాయల్లో టర్నోవర్ సాధించడం గర్వకారణమని సంఘం సీఈవో సంగీత పేర్కొన్నారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలో ఏర్పాటు చేసిన పొదుపు సంఘం క్యాలండర్‌ను ఆవిష్కరణ కార్యక్రమానికి కౌన్సిలర్లు మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, రేవల్లె హరితాయాదగిరి, సీఈవో సంగీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలకు కేవలం రూ.100 పొదుపుతో ఈ సంఘం నడుస్తోందన్నారు. సభ్యులకు అతి తక్కువ వడ్డీతో రూ.2 లక్షలవరకు రుణాలతోపాటు, ఇన్సూరెన్స్ సౌకర్యం, మరణించిన వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మన్నెగూడ సంఘం అధ్యక్షుడు గోదాసు భద్రయ్య, సభ్యులు ఆదిమూలం వెంకటాచారి, రాణి, కామేటి రమేష్, వట్నాల ధనుంజయగౌడ్, మహిపాల్‌రెడ్డి, అంజమ్మ, హారిక, జయేందర్‌రెడ్డి, శ్యామల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలుకు కృషి : రజితరెడ్డి

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** ఉప్పల్ డివిజన్‌లో అర్హులైన పేదలందరికి అరు గ్యారంటీలను అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మందముల రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ డివిజన్‌పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ రజితరెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పథకాలకు అర్హులైన వారు ఆయా కేంద్రాలలో ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ తీసుకుని వచ్చిన ఈ పథకాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నేతలు లుకాస్,మధుబాలు, చిన్న ప్రసాద్, బ్రహ్మచారి, సుధాకర్,నాగరాజు, మీసాల రాములు, సురేందర్‌రెడ్డి, అనిల్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇంచార్జితో శ్రవణ్‌రెడ్డి బేటి

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జీ దీపాదాస్ మున్షీని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపాదాస్ మున్షీ మొదటిసారిగా నగరానికి వచ్చిన ఆమెతో బేటి అయి పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## శివసాయినగర్‌లో అయోధ్యనుండి వచ్చిన కలశం, అక్షింతలకు పూజలు

**సరూర్‌నగర్, జనవరి 2 ప్రభాతవార్త:** అయోధ్యనుండి వచ్చిన కలశం, అక్షింతలకు మంగళవారం మీర్‌పేట్ శివసాయినగర్‌లోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీ గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, గంగా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా పూజల అనంతరం ఆలయన అర్చకులు లక్ష్మీ గణపతిరావు, హయగ్రీవశర్మలు అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్దిదారులకు చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త :** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ తహసీల్దార్ వెంకటనరసిం హారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన 92 చెక్‌లను కార్పొరేటర్లు బన్నాల గీత, ఎం.రజితరెడ్డి, కక్కిరేణి చేతన తదితరులతో కలిసి లబ్దిదారులకు చెక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అర్హులైన పేదలకు కల్యాణలక్ష్మి చెక్‌లు అందజేస్తుందని, కొత్తగా పెళ్లి చేసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేదల కోసం తమ వంతు పాటుపడుతామన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు అనంత రాములు, సుధ, బిఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, బన్నాల ప్రవీణ్, పలువురు పార్టీ నేతలు అధికారులు పాల్గొన్నారు.

## సినిమా అవార్డ్స్ వేడుకకు ఎంతో ఆవశ్యకత ఉంది : కృష్ణాదిశేషు



మంత్రి కోమటిరెడ్డితో కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు

**వనస్థలిపురం,జనవరి 2 ప్రభాత వార్త :** సినిమాటో గ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సభ్యులు వాస్తు నిపుణులు పెంటపాటి కృష్ణాదిశేషు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ సినిమా అవార్డ్స్ వెంటనే పెట్టాలని వాటి అవశ్యకత గురించి వివరించారు. సామాన్య ప్రజలు నుండి విద్యావంతులవరకు చక్కని వినోదంతోపాటు అధ్యాత్మికత చరిత్ర సందేశాలతో సినిమాలు తీసి ఇటు ప్రేక్షకులకు వినోదాన్ని పంచి, ప్రభుత్వానికి కూడా ఆదాయ వనరులు ఇచ్చే కామధేనువు సినీపరిశ్రమ అని ప్రభుత్వాలు సినిమారంగాన్ని, ఉత్తమచిత్రాలకు అందులో పని చేసి ప్రతిభ కనపరచిన కళాకారులకు, సాంకేతిక నిపుణులకు నంది ఫిల్మ్ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. సినిమారంగానికి చేయూతనిచ్చి గత వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరముందని, కొత్తగా నెలకొన్న ప్రభుత్వం సినిమారంగాన్ని పోత్సహించే క్రమంలో కాకతీయ తెలుగు ఫిల్మ్ అవార్డ్స్ పేరిట అవార్డులను ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచనలు చేసారు. మన తెలంగాణా రాష్ట్రంలో కాకతీయుల ఘనచరిత్ర విశిష్టత కలిగి ఉందని ఈ క్రమంలో కాకతీయ తెలుగు ఫిల్మ్ అవార్డు పేరు సముచితంగా ఉంటుందని తెలిపారు. అనంతరం మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డ్స్ విషయం త్వరలో నిర్ణయం తీసుకుంటామని, అదే విధంగా అవార్డుల పేరు, విషయం దృష్టిలో పెట్టుకుంటామని తెలిపారని ఆయన పేర్కొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు వినతి : కార్పొరేటర్ అరుణ



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

**సైదాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మంగళవారం డిఇ హనుమంత్‌రెడ్డి, ఎఇ వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లో అవసరమైన చోట బంచ్ కేబుల్స్ ఏర్పాటు చేయాలని, ప్రమాదకరంగా ఉన్న ఐరన్ బాక్స్ మీటర్లను తొలగించాలని, ఉపయోగంలో లేని సిమెంట్ పోల్స్‌ను తొలగించాలని, జయానగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, వీది దీపాల సమస్యలు పరిష్కరించాలని, తప్పు పట్టి ప్రమాదకరంగా మారిన పోల్స్ స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని అధికారులను కార్పొరేటర్ కోరారు.

## దోమల బెడదను నివారించాలి : బద్ధం



గుర్రపుడెక్క తొలంగిపు పనులను పరిశీలిస్తున్న ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ చెరువునుండి గుర్రపు డెక్కను యుద్ధ ప్రాతిప్రదికన శుద్ధి చేసి దోమల బెడద నుంచి విముక్తి కలిగించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్ధం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో మంగళవారం ఎఫ్టిసి యంత్రంతో ఎంటమాలజీ సిబ్బంది గురపు డెక్క తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గుర్రపుడెక్క తొలగింపు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్‌బినగర్‌జోన్‌లో ఒక్క ఎఫ్‌టిసి యంత్రం మాత్రమే ఉందని, సరూర్‌నగర్‌చెరువు కొన్ని సంవత్సరాలనుండి సుందరీకరణకు నోచుకోకపోవడంతో డివిజన్ ప్రజలు చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం కారణంగా దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన నిధుల కొరతతో శుద్ధీకరణ యంత్రాలు, ఫాగింగ్ యంత్రాలు సమకూర్చుకోలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించి డివిజన్ ప్రజల ఇబ్బందులను తొలగించాలని, లేని పక్షంలో కాలనీవాసులతో కలసి జోనల్ ఆఫీస్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజి ఏఈ రాంబాబు, అర్జున్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయ ప్రకాష్, శ్రవణ్‌గౌడ్, చిలకూరి మధుసూదన్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభలను పరిశీలించిన ప్రత్యేకాధికారి

**సరూర్‌నగర్, జనవరి 2 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన వార్డు సభలను మంగళవారం ప్రజా పాలన ప్రత్యేకాధికారి అయిన జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేషన్‌లోని 4, 12, 27, 29 డివిజన్లలో పర్యటించి వార్డు సభల తీరు తెన్నులను, దరఖాస్తుల స్వీకరణను పర్యవేక్షించారు. ఈ మేరకు ఆయన ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ ఎ.వాణి, మేనేజర్ నూకల వెంకట్‌రెడ్డి, వార్డు సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.